


# ఈ కాలపు పిల్లలు

— ఇచ్ఛాపురపు రామచంద్రం



చివరి క్షణంలో - రైలుపెట్టెలోకి ఎక్కాను. కంపార్టుమెంటు చూసుకుని ఎక్కడం నా కలవాటే కాని- అలా కుదరలేదు, అరగంట ఆలస్యమౌతుందన్న రైలు యిరవై ఐదు నిముషాల చిల్లరే ఆలస్యం కావడంవల్ల.

అదృష్టమూ, ఆశ్చర్యమూ ఏమిటంటే-జనరల్ కంపార్టుమెంటులో కూడా సీటు దొరకడం. ఆ సీటు మీద మేము మొత్తం ఐదుగురం. ఎదుటి సీటుమీదా ఐదుగురే. నా



పీటుమీద మిగిలిన నలుగురిలోనూ ఒకతను చాలా ముసలివాడు. మిగిలిన ముగ్గురూ ఏభై దాటి వృద్ధాప్యంలో అడుగుపెడుతున్నవారు.

ఎదుటి బెంచీమీద- కిటికీవారగా యిద్దరు కుర్రాళ్ళు. పద్దెనిమిదీ యిరవైల మధ్య ఉంటుంది వారి వయసు. మిగిలిన ముగ్గురూ వృద్ధులే. చూడబోతే నేను ఏ కోవకీ చెందకుండా ఒంటరిగా మిగిలిపోయానట్లున్నాను.

రైలు పరుగెడుతూంటే —

మాటలూ, వాదనలూ మొదలయ్యాయి.

శివుడు గొప్పవాడంటూ ఓ వృద్ధుడు శివపురాణంలో పద్యాలు చదవసాగాడు. హరిని మించిన దేవుడులేడని ఎదుటి సీటు వృద్ధుడు హరివంశం పాడసాగాడు. మిగిలిన వృద్ధులలో ఒకరు తప్ప, మిగిలిన వారు అటో యిటో చేరిపోయారు.

శివకేశవుల పేరిట అక్కడ వాగ్యుద్ధమూ, పద్యాల, పాటల రణరంగమూ ఏర్పడింది. ఒకే ఒక వృద్ధుడు మాత్రం - భగవద్గీతను మించిన గ్రంథమేలేదనీ, కృష్ణుని మించిన భగవంతుడే లేడనీ గొంతు చించుకుంటున్నాడు. కుర్రవాళ్ళిద్దరూ కృష్ణంరాజు గొప్ప హీరోనా, కమల్‌హాసన్ గొప్ప హీరోనా అని చర్చించుకుంటున్నారు.

ఈ రెండు ఎదుటి సీట్లూ కాక - పక్క సీటులో ఆడవాళ్ళు కూర్చున్నారు. వాళ్ళలో పడుచుపిల్లలూ ఉన్నారు. వాళ్ళు అందంగానూ, చలాకీగానూ ఉంటనూ ఉన్నారు, ఆ వయసుకి సహజంగా. ఆడవాళ్ళుకూడా తెగ మాట్లాడుకుంటున్నారేమో - రైలు రొద విన పడడంలేదు.

కుర్రాళ్ళిద్దరూ హుషారుగా యీల పాట అందుకున్నారు.

ఓ వృద్ధుడు విసుక్కున్నాడు - "హరినామ సంకీర్తన చేసుకుంటూంటే మధ్య మీ గోలేమిటి?"

"మీ గోల వినలేకనేకదా తాతగారూ మేము పాటలు మొదలుపెట్టాం!" కిసుక్కున నవ్వాడు కుర్రాడు.

"ఏమిటీ! మాది గోలా? పుణ్యమూ పురుషార్థమూలేని మీ లొల్లాయి పదాలు గొప్పవా!" మరో వృద్ధుడు కలగజేసుకున్నాడు.

"ఏది పుణ్యం, ఏది పాపం తాతగారూ? పాపపుణ్యాలూ, తప్పొప్పులూ మనం నిర్ణయించుకున్నవే" రెండో కుర్రాడందుకున్నాడు.

"దేముడు పాపులను నరకంలో తోయకమానడు. కార్తీకపురాణం-"

"కలడు కలండనెడువాడు కలడో లేడో! వాడి ఉనికే సందేహాస్పదమైనప్పుడు వాడు సృష్టించిన స్వర్గనరకాలు మరీ డౌట్‌ఫుల్ కాదూ."

ఆ వృద్ధుడికి చాలా కోపమూ, ఉద్రేకమూ వచ్చినట్లున్నాయి. "ఈ కాలప్పిల్లలకి పాపపుణ్యాలూ లేవు, మంచిచెడ్డలూ లేవు. పిదపకాలమూ, పిదప బుద్ధులూ" అంటూ రొంటి మంచి పొడుంకాయతీసి చిటికెడేసి పొడుం రెండు నాసికా రంధ్రాల

లోకి దట్టించి – ఆ వేళ్ళు కిటికీ చెక్కకి పామేశాడు.

ఇద్దరు కుర్రాళ్ళూ చెరో సిగరెట్టూ తీసి ఒకే అగ్గిపుల్లతో వెలిగించారు. ఆ పక్కా పక్కంతా పొగమయం.

వృద్ధుడికి కోపం వచ్చేసింది తారస్థాయిలో. చర్రున లేచాడు. "ఏమిటీ సిగరెట్ పొగ అసహ్యంగా!"

"పొడుం మాత్రం అసహ్యం కాదూ!" శాంతంగా బదులు చెప్పాడబ్బాయి.

"నస్యం - పండిత లక్షణం. పొడుం పీల్చితే ఎదటివాడికి హాని జరగదు. వాతావరణ కాలుష్యం జరగదు. సిగరెట్ పొగ అలా కాదే!"

"సిగరెట్ - స్కాలర్ లక్షణం. సిగరెట్ కాల్చేవాడు – ఎదుటివాడికి వికారం వచ్చేలా జుర్రూ బుర్రూ మని శబ్దం చెయ్యడు. సిగరెట్ బూడిద తుడిస్తే పోతుంది, పొడుం మరక ఓ పట్టాన పోదు. పొడుం పీల్చిన ముక్కుల్నుంచి - పై పెదవి దాకా నల్లని కాటుకచూస్తే వాతావరణ కాలుష్యం కాదు, చూసేవారి హృదయమే కలుషితమైపోతుంది. సిగరెట్‌లో హుందాతనం ఉంది. నాగరికత ఉంది."

ఆ అబ్బాయిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను మనసులో. సిగరెట్ సివిలిజేషననీ, పొడుం అనాగరికత అనీ తిరుగులేకుండా నచ్చజెప్పాడు మరీ తెలివిగా.

ఓడిపోయినట్లున్నారా తాతగారు.

"పెద్దా చిన్నా లేదు. మాటకి మాట బదులు చెప్పడమే! ఈ కాలప్పిల్లలింతే! మా రోజుల్లో .... మన రోజుల్లో..."

"క్షమించండి తాతగారూ! ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం సంస్కృతంలో వ్రాయలేదు కనుక మీరు తెలుసుకుని ఉండరు. పెద్దా చిన్నా అనేవి దేనికది విడిగా అర్థంలేని మాటలు. మీకంటె చిన్నవారి ముందు మీరు పెద్ద. మీకంటె పెద్దవారిముందు మీరు చిన్న. మరోలా అయినా యిక్కడ పెద్దా చిన్నా లేకపోవడమేమిటి - మీరూ మేమూ యిద్దరముండగా?"

పిడుగే అనుకున్నాను.

ఇంతలో ఏదో స్టేషను వచ్చింది. కుర్రాళ్ళు కాఫీ పిలిచారు. త్రాగి – ముఖం అదోలా పెట్టి- "పట్టుకు పో. నీకు డబ్బులివ్వం" అన్నారు గ్లాసుల్లో మూడోవంతు పైగా కాఫీ వదిలేసి.

"అదేంవిటి బాబూ!" దీనంగా చూశాడు వాడు.

"ఎందు కివ్వాలి! నువ్వు మా కిచ్చింది కాఫీయా- వేడినీళ్ళా?"

సమయం దొరికిందని — ఓ ముసలాయన కలుగజేసుకుని — "వాడికెందు కేడిపిస్తారు? డబ్బి చ్చెయ్యండి" అన్నారు.

"మేమివ్వం" మొండిగా అన్నారు కుర్రాళ్ళు.

"మూడేళ్ళు సాముచేసి మూల నున్న ముసలి ముండను కొట్టాడని- వీళ్ళ ప్రతాపం కాఫీ కుర్రాళ్ళమీద? ఊహో!" వెక్కిరిస్తున్నట్లే అన్నా డొక వృద్ధుడు.

"వాడిమీద అంత జాలి ఉంటే మీరివ్వండి. కాఫీ అని వేడినీళ్ళిచ్చి మోసం చేస్తే ఊరుకుందుకు మేము చవటలం కాము."

"సార్! నాకేమీ తెలియదు సార్! అక్కడ మేనేజరు యిచ్చిన కాఫీయే పట్టుకొచ్చి నేనిస్తున్నానంతే సార్!" ఏడుపు వచ్చేసింది వాడి కంఠంలోకి.

"మీ మానేజరుకో, ప్రొప్రయిటరుకో చెప్పి పిల్చుకురా. వాడి మొఖంమీదే పోస్తాం యీ వేడి నీళ్ళు."

"బండి కదిలిపోతూంది సార్! మీరివ్వకపోతే నాదగ్గర తీసుకుంటాడు సార్!"

బండి కదిలింది. కుర్రాళ్ళు వాడికి డబ్బులిచ్చేస్తూ - "జరిగినదంతా మీ ప్రొప్రయిటరుకి చెప్పు" అన్నారు.

ముసలివాళ్ళు గుసగుసలు మొదలుపెట్టారు తమలో తాము.

కుర్రాళ్ళిద్దరూ సిగరెట్లంటించి పడుచు పిల్లలవేపు దొంగచూపులు చూడసాగారు.

"ఆ అమ్మాయి- జయమాలినిలా లేదూ?" ఓ కుర్రాడు రెండోవాడి నడిగాడు.

"చాలా పోలిక లున్నాయి."

ఇంతలో ఓ ముసలాయన కలుగజేసుకున్నాడు - "జయమాలి నంటే గుడ్డలిప్పుకొని తెరమీద తైతక్కలాడే తారేనా?"

"ఔను. మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా చూశారు కుర్రాళ్ళు.

"మావాళ్ళెప్పుడూ దాని గురించే అనుకుంటూంటారు. అందుకని తెలిసింది."

"ఇంకా మీరూ జయమాలిని ఫ్యానేమో అనుకున్నాను." నవ్వాడు కుర్రాడు.

తాతగారు ముఖం కందగడ్డలా చేసుకుని- "నోటి కెంతవస్తే అంతా పేలడమేనా? పెద్దవాడినన్న గౌరమేనా లేదా? జయమాలినీ, జ్యోతిలక్ష్మి అని పిచ్చెక్కిపోడానికి నేను కుర్రవెధవనీ కాను, వెర్రివెధవనీ కాను" అన్నాడు మండిపడుతూ.

"కుర్రతనానికేముంది లెండి? వై లీజ్ ద ఫాదరాఫ్ మాన్ అన్నారు. కనుక మీరు కుర్రతనమూ తెచ్చుకోవచ్చు. పోతే- వెర్రితన మంటారా? అందరికీ అంతో యింతో ఉండనే ఉంటుంది. మీరు పురాణాలూ గట్రా చదివినవారేగా?"

"ఊఁ— ఐతే?"

"మీకు మీరు ఆలోచించుకోండి: అవి చదువుతూ రంభ గురించీ, ఊర్వశి గురించి కలలు కనలేదూ? స్వర్గానికి వెళ్ళి తిలోత్తమతో గడపాలని తపించలేదూ? అసలు - ఊర్వశంటే అర్థమేమిటి?" వివాదంగా తొణక్కుండా, కోపగించుకోకుండా అడిగారు కుర్రవాళ్ళు.

"రంభా - ఊర్వశులకీ, జయమాలిని- జ్యోతిలక్ష్మిలకీ పోలికా?" గర్జించాడు.

"కలలో బంగారం కంటె యిలలో యిత్తడి మేలు కదా? ఆంగ్లంలో-ఎ బర్డ్ యిన్ ద హాండీజ్ వర్త్ టు యిన్ దబుష్. ఉందో లేదో తెలీని స్వర్గంలో ఉంటారో ఊహో అయిన రంభా - ఊర్వశులకంటె, భూమ్మీద ఉండే జయమాలిని— జ్యోతిలక్ష్మిల గురించి వెర్రెత్తిపోడమే వివేకం."

పడుచుపిల్లలు పక్కున నవ్వారు- కుర్రాళ్ళనభినందిస్తున్నట్లు, వృద్ధులని వెక్కిరిస్తున్నట్లూ. ఇక ఆ ముసిలాయన మౌనంగా-ముఖం ముడుచుక్కూర్చున్నాడు.

నేనంతా గమనిస్తూనే ఉన్నాను.

కేవలం రైలులో కలుసుకున్న వృద్ధులందరూ ఒక పక్షం అయిపోయారు. కుర్రవాళ్ళిద్దరూ స్నేహితుల్లా ఉన్నారు. వాళ్ళు నిజంగా పిడుగులే! ముసలివాళ్ళ మాటల కెటువంటి జవాబులు చెప్పారని! కుర్రవాళ్ళ పక్షం తీసుకోకపోయినా నా మనసు వారివేపే మొగ్గుతూంది. నిజానికి - ముసిలివాళ్ళే కుర్రాళ్ళని రెచ్చగొట్టారు మొదట.

"చూడు - చూడు ఎంత తెగించారో! పరాయి పిల్లలని చూసి వికవికలూ పకపకలూ. ఆడపిల్లలకీ సిగ్గులేదు, మగపిల్లలకీ బుద్ధిలేదు."

ఈసారి కుర్రాళ్ళు తగిన సమాధానం యిచ్చారు. "చూడండి తాతగారూ! వాళ్ళకి సిగ్గూ ఉంది, మాకూ బుద్ధీ ఉంది. రైలుదిగాక ఎవరితోవ వారిదే. ఇక్కడ - రైలులో కలిసి ప్రయాణించే కాస్సేపూ కమ్మని కలలా గడపాలి కాని ముఖం గంటుపెట్టుకుని ధుమధుమలాడుతూ కూర్చోడం ఏం మంచిది? సంతోషం సగం బలం. అదీకాక - పెద్దవారు-మీకూ తెలిసే ఉంటుంది-నవ్వుకి శ్రుతి కలుస్తుంది

కాని దుఃఖానికి జత ఉండదు. సరదాయే జీవితం. మా సరదా ఎవరికీ ఏమాత్రమూ హాని చెయ్యదు. నొప్పించడంకంటె నవ్వించడమే నరుడికి మంచి అర్హత."

మాటలు ఘాటుగా, మొక్కజొన్న పొడంలా నసాళాని కంటాయి ఆ బోలు- ఆయనేకాదు, వృద్ధ సంఘం అంతా మౌనంగా మిగిలిపోయారు.

రైలు పరుగెత్తుతూంది.

"వచ్చేదే స్టేషనో!" ఒకరినడిగినట్లు కాక గొణుక్కున్నట్లన్నాడు వృద్ధుడు.

ఈ లైను నాకు సుపరిచితం కనుక చెప్పాను- "అన్నవరం."

"అన్నవరమే! వచ్చేశానన్నమాట! ఇప్పుడెలా?"

"మీకేమైంది? దిగవలసిన స్టేషను వస్తే సంతోషించాలి కాని కంగారూ విచారమూ దేనికి?" ఆశ్చర్య పడుతూ అడిగాను.

"అదికాదు, సామాను....చాలా సామాను. అసలు నేనే రైలు దిగలేను. తల దూరకంతలేదు కానీ మెడకో డోలన్నట్లు- చిన్నా చితకా వచ్చేటంత సామాను అక్కడయితే అబ్బాయి రైలుపెట్టి ఎక్కించాడు నన్నూ, సామానునీ. కాని దిగడం ఎలా?"

"అన్నవరంలో ఓ నిముషం కంటె ఆగదు రైలు" అన్నాను.

ఆ వృద్ధుడికి కంగారు మరింత ఎక్కువైంది.

"మీకోసం ఎవరూ రారూ స్టేషన్‌కి?"

"వచ్చినా- నన్ను వాళ్ళు చూసే సరికి రైలు కాస్తా పరుగందుకుంటుంది."

"నేను సాయం చేస్తాను, మీకేమీ ఫరవాలేదు. నలుగురమూ నాలుగుచేతులూ వేస్తే నాలుగుబళ్ళ సామాను దించెయ్యొచ్చు అవలీలగా అరనిముషంలో."

సహాయం అర్థిస్తున్నట్లు వృద్ధుడు తన వృద్ధ బృందం వేపు చూశాడు.

"నాకు కీళ్ళనొప్పి."

"నాకసలే ఆయాసం."

"నాకు బి. పి."

"అసలే గుండె బలహీనం మనిషిని. ఐనా-అన్నిట్నీ సామాను లేమిటి?"

"నాకు వొళ్ళు నెప్పబడినట్లనుమానంగా ఉంది."

వృద్ధులందరూ తలో సాకూ చెప్పేసి తప్పించుకున్నారు.

ఇక మిగిలింది- యిద్దరు కుర్రాళ్ళు.

ఆ వాయలకే చూపు సారించలేదు వృద్ధుడు. ఔను - అలా జరి

గాక వాళ్ళ సాయం ఎలా అర్థిస్తాడు? అడిగినా వారొప్పవద్దూ?

సామానంతటినీ ఒకచోట చేర్చాను. జాడీలూ, సీసాలూ, మూటలూ-చాలా ఉన్నాయి. నాకూ సందేహం వచ్చింది-ఈ సామానంతా దింపగలనా?

రైలు - వేగం తగ్గించుకుంటూంది. కిటికీలోంచి సత్యనారాయణమూర్తి కోవెల - కొండ మీద కనిపిస్తూంది.

సామానుని చూస్తున్న వృద్ధుడి కన్నులలో నీళ్ళు తిరుగుతున్నాయి.

నేను ధైర్యం చెప్పబోయాను.

"తప్పు వాడిదే. ముసలాడి పీకలమీదకి యింత సామాను నెట్టేశాడు. అయ్యో, వీడెలా దిగిచస్తాడన్న ఆలోచనేలేదు. అబ్బే! యీ కాలపిల్లల కంత ఆలోచన కూడానా?"

సరిగ్గా అదే క్షణంలో ఓ కుర్రాడు-యిద్దరిలో వాడే - నన్నూ తాతగారినీ దాటుకుని వెళ్ళి గేటుదగ్గరగా నిలుచున్నాడు

"చూశావు బాబూ! అతగాడి అకతాయితనం. నన్ను దిగనివ్వకుండా సామాను దింపుకోనివ్వకుండా ఎలా అడ్డంగా నిలుచున్నాడో!"

"ఆ విషయం నేను చూస్తాను. మీరు గుమ్మందగ్గరకి పదండి."

చెయ్యి పట్టుకుని ద్వారంవద్దకు వృద్ధుణ్ణి నడిపించానో లేదో-రైలు ఆగింది.

గేటుదగ్గర కుర్రాడు ప్లాట్‌ఫారం మీద కురికాడు. ఒక్క నిముషం-అంతే!

ప్లాటుఫారం మీద తాతగారు-తన పదకొండు సామానులతోనూ భద్రంగా వున్నాడు.

రైలు కూత వేసింది. ఎందుకో-తాతగారు కళ్ళు తుడుచుకుంటున్నారు కండువాతో.

"ఉంటాం తాతగారూ! మరోలా అనుకోకండి. నిజంగా అల్లరిచేస్తే-యీ కాలప్పిల్లలం కనుక-మీరు పెద్దవారు కనుక-దయచేసి క్షమించండి!" రైలు వేగం పెంచుకుంటూంటే ఆ కుర్రాడు లోపలికి వచ్చి కూర్చున్నాడు మిత్రుడి పక్క.

నేనన్నాను ఉండబట్టలేక - "మీకు నా అభినందనలు. మీరు నిజంగా చాలా సాయం చేశారు. లేకపోతే ఆయనా ఆయన సామానూ భద్రంగా దిగేవి కాదు."

"మేం చేసింది సాయం కాదు-డ్యూటీ-సహప్రయాణీకులుగా."

ఇంక వారిని మెచ్చుకుందుకు నాకు మాటలు పెగలలేదు. ఆ యిద్దరు యీ కాలప్పిల్లలనీ చూస్తూ మురిసిపోయాను. ★